రెండు చేతులతోటీ శక్తికొద్దీ వాడి గొంతుక పిసికేసింది. నిమిషంలో పిల్లాడు ఏడ్పు మానేశాడు. సద్దుకాకుండా పెరట్లోకి వెళ్ళి వీరయ్యని కలుసుకొంది.

మళ్లీ వచ్చిన తరువాత, పిల్లాడి మీద చెయ్యివేసి చూస్తే, ఊపిరి లేదు.

కెవ్వున కేకవేసి, గొల్లుమంది.

---

# 16. సెలవు

సెలవు కోసం వ్రాస్తే, దొరదగ్గిర్నుంచి ఇంకా ఉత్తరువు రాలేదు. భార్యకి చలిజ్వరం. రెండు సంవత్సరాల కూతురికి కడుపులో బల్ల. తనకి వండి పెట్టే దిక్కు లేదు ఆ ఊళ్ళో డాక్టరు లేడు. డాక్టరు కోసం ఒక కాన్‌స్టబిల్ని పంపించినా యింకా ఎవరూ రాలేదు. అతీగతీ తోచక వాకిట్లో కుర్చీలో కూచున్నాడు సబిన్‌స్పెక్టరు శ్రీనివాసరావు. ఎదురుగా హెడ్ కాన్‌స్టబిల్ నిలుచున్నాడు.

శ్రీనివాసరావు బ్రాహ్మణుడు. ఆ ఊళ్లో గ్రామకరణం ఇల్లు తప్ప వేరే బ్రాహ్మణ కొంప లేదు. రెండు నెలలనాడు గ్రామకరణానికీ మునసబుకీ తగాదా వచ్చి, రెండు పార్టీలవారూ కొట్టుకున్నారు. ఆ కేసులో న్యాయం ఎటువైపున ఉన్నా శ్రీనివాసరావు మునసబు పక్షంలో పనిచేశాడు. కరణం నాలుగువందలు ఆశ చూపినా శ్రీనివాసరావు చెయ్యి చాపలేదు. తను ఇవ్వబోయిన నాలుగువందలు తీసుకోకపోవడంవల్ల "మునసబు దగ్గిర ఏడెనిమిది వందలు కాజేసి వుంటాడు" అని కరణం అన్నాడు. మునసబు మటుకు తన పార్టీ పెద్దలదగ్గిర "దమ్మిడీ ఇవ్వలేదు నేను. మన పార్టీవాళ్ళకి దెబ్బలు ఉరువుగా తగిలాయి. కరణం పార్టీవాళ్ళు తప్పించుకున్నారు. అంచేత ఆ పార్టీవాళ్ళలో

యిద్దర్నీ అరెస్టుచేశాడని సబిన్‌స్పెక్టరు మీద కరణం తప్పుడు కూతలు కూస్తే ఎట్లా?" అన్నాడు. ఈ పరిస్థితులలో ఆ గ్రామంలో ఉన్న ఒకే ఒక బ్రాహ్మణ కుటుంబమైన కరణం ఇంటినుంచి సబిన్‌స్పెక్టరుకు ఏ విధమైన సహాయమూ రాదు. అతనికి వంట చేతకాదు. మూలుగుతూ, ముక్కుతూ రెండురోజులనుంచీ జ్వరంతో బాధపడుతూనే భార్య ఆ రెండు రోజులూ వంట వండింది. కాని, ఇవ్వాళ ఆమె లేవనేలేదు. ఇహ కూతురు మాటా—కడుపులో కొద్దిగా బల్ల ఉన్నదన్నప్పటి నుంచీ, ఆ వూళ్ళో నాటు వైద్యంలో ప్రశస్తిపొందిన శివలింగయ్యచేత వైద్యం చేయిస్తున్నారు. కాని పిల్లకి ఒళ్ళంతా—కనురెప్పలతో సహా—ఉబ్బిపోయినాయి. రోగం రోజురోజుకీ ఎక్కువైపోయింది. ఆ పిల్ల బ్రతకదని తల్లిదండ్రులు నిశ్చయం చేసుకున్నారు. కాని, ప్రాణం ఉన్నంతసేపూ పట్టుకొని పాకులాడక తప్పదు గదా!

పిల్లకీ, పెళ్లానికీ మందుమాట ఏమిటీ? తన తిండిమాట ఏమిటీ? సబిన్‌స్పెక్టరుకి ఏమీ తోచలేదు. ప్రొద్దున మట్టుకు తనకుతానే ఎలాగో కాఫీ కాచుకున్నాడు. కాఫీ కాచుకోవడమే ప్రళయం అయింది. సగం పాలు పొంగిపోవటం; డికాక్షను దొర్లిపోవడం; కాఫీ అంతా పానకం అయిపోవడం! మధ్యాహ్నం ఎలా గడవాలి, సాయంత్రం ఎలా గడవాలి?

"ఏం మస్తాన్, ఏమిటి దారి?" అని సబిన్‌స్పెక్టరు హెడ్ కాన్‌స్టబిల్ని అడిగాడు. హెడ్‌కాన్‌స్టబిలు పెద్ద సంసారి. కష్టసుఖాలు ఎరిగినవాడు. సబిన్‌స్పెక్టరు అవస్థకి జాలిపడ్డాడు.

ఆ ఊరికి ప్రక్కనే, నాలుగుమైళ్ళ దూరంలో ఉన్న ఒక ఊరు పేరు చెప్పి, ఆ ఊళ్ళో చాలమంది బ్రాహ్మణులు ఉన్నారనీ, వంటచేసే వాళ్లుకూడా ఉన్నారనీ, సబిన్‌స్పెక్టరు అంగీకరిస్తే ఒక కాన్‌స్టబిల్ని పంపించి ఎవర్నేనా బ్రాహ్మణ్ణి పిలిపిస్తాననీ మస్తాన్ చెప్పాడు.

సబిన్‌స్పెక్టరు వెంటనే పంపించమన్నాడు. కాన్‌స్టబిలు మళ్ళీ రావడానికి ఆలస్యమౌతుందేమోనని తన గుర్రాన్ని తీసుకొని వెళ్ళమన్నాడు. కాని, సైకిలు ఉన్న కాన్‌స్టబిల్ను పంపుతానని హెడ్‌కాన్‌స్టబిలు చెప్పాడు.

"అయితే మరీ మంచిది. తొందరగా వెళ్ళమను. నాకు అప్పుడే ప్రాణాలు పోతున్నాయి" అని సబిన్‌స్పెక్టర్ తన కష్టాన్ని హెడ్‌కాన్‌స్టబిల్‌దగ్గర వెళ్ళబోసుకున్నాడు. కాన్‌స్టబిలును పంపించడానికి మస్తాన్ వెళ్ళిపోయాడు.

*　　*　　*

డాక్టరుకోసం పంపిన కాన్‌స్టబిలుగాని, డాక్టరుగాని వస్తారేమో అని సబిన్‌స్పెక్టరు ఎదురు చూస్తూ కూచున్నాడు. ఆ ఊరు మన్యంలో వున్నది. చాలా పల్లెటూరు. తాలూకాకి ఇరవై మైళ్ళదూరం. తాలూకా హెడ్‌క్వార్టర్సులో తప్ప ఆ తాలూకాలో ఇంకెక్కడా డాక్టరు లేడు. డాక్టరుకూడా నాలుగు ఊళ్ళకీ వెళ్ళి నలుగురికీ సహాయపడాలంటే రోడ్లు బాగా పడలేదు. బస్సు సర్వీసు రెండుమూడు రోడ్లమీదకన్న లేదు. రోడ్లువేసినా, బస్సులు నడచినా వ్యాపారం బాగా సాగే ప్రాంతాలలో గాని, మన్య ప్రాంతాలలో యీ సౌకర్యాలు ఎందుకు ఉంటాయి! వాటి విషయమై శ్రద్ధ తీసుకునేవా రెవరు?

డాక్టరును అర్జంటుగా తీసుకురావలసిందని, గుర్రబ్బండి చార్జీలు ఇచ్చి కాన్‌స్టబిలును నిన్న మధ్యాహ్నమనగా పంపించినా ఇంతవరకూ ఎవరి జాడా లేదు. నడవలోకి వళ్ళి భార్యపడే అవస్థనుగాని, కూతురుపడే బాధనుగాని చూసి వాళ్ళకి కొంతధైర్యంగా తాను పక్కన వుండడానికి అతనికి భయంవేసింది. దాసీదే ఆ రోగు లిద్దరికీ దిక్కయింది. శ్రీనివాసరావు ఆలోచిస్తూ అలానే కుర్చీలో ఉండిపోయాడు. చాలాసేపు గడిచిపోయింది. ఆకలి బాగా వేస్తోంది. నీరసం ఎక్కువ అవుతోంది. తనకు కూడా జ్వరం వస్తూ ఉన్నట్టుంది.

గుర్రబ్బండి చప్పుడు వినపడింది. డాక్టరు వస్తున్నాడేమోనని శ్రీనివాసరావు కుర్చీలోనుంచి లేచి రోడ్డుమీదకి వచ్చి నిలుచున్నాడు. గుర్రబ్బండి దగ్గరకు వచ్చింది. దానిలోనుంచి, తాను డాక్టరుకోసం పంపిన కాన్‌స్టబిల్ దిగి సలాం పెట్టాడు. డాక్టరు కనపడలేదు.

"ఏం, డాక్టరు రాలేదూ?" అని అడిగాడు శ్రీనివాసరావు.

"లేదు సార్, సర్కిలినస్పెక్టరుగారి భార్యగారికి కాన్పురోజు లంట. అంచేత కాన్పు అయినదాకా డాక్టరుగారిని ఏ వూరికీ పోనివ్వ

కుండా ఆపేస్తున్నారంట సార్. డాక్టరుగారు నా కబురు వినగానే సర్కిల్ గారి దగ్గరకు వెళ్ళి చాలాసేపు మాట్లాడారంట గాని కాన్పు యిప్పుడో, యింకాసేపటికో అవుతుందని సర్కిల్‌గారు ఒప్పుకోలేదటండి. కాన్పు అయిపోగానే డాక్టరుగారు ఇక్కడికి వస్తానన్నారు. ప్రస్తుతం అమ్మ గారికి ఈ మందు వాడమన్నా రండి" అని సబిన్‌స్పెక్టరుకు మందు సీసాలు యిచ్చాడు, కాన్‌స్టబిల్.

"ఎప్పుడో కాన్పు వస్తుందని, యివతల చంటిపిల్ల ప్రాణం మీదికి వచ్చివుంటే డాక్టర్‌ని రానియ్యకుండా చేశాడా సర్కిల్ ఇన స్పెక్టరు—" అని సర్కిల్ ఇనస్పెక్టరును ఏదో అనబోయి, కాన్‌స్ట బిలు దగ్గిర సర్కిల్ ఇనస్పెక్టరును తిట్టడం ఏమంత మంచిది కాదని తెలిసి, ఊరుకున్నాడు శ్రీనివాసరావు. కాని, తన దైన్యస్థితికి దుఃఖము వచ్చింది. కళ్లు నీరుగ్రమ్మాయి. కాన్‌స్టబిల్‌కు సబిన్‌స్పెక్టరు అవస్థ చూసి జాలి వేసింది. "అమ్మగారికి ఎలా ఉంది అయ్యా?" అని అడిగాడు.

"అమ్మగారికి చలిజ్వరం. ఏమీ అంత బాగా లేదు. కాని అమ్మాయి—మాటే" అని పూర్తిగా చెప్పలేక పోయాడు శ్రీనివాస రావు.

"అమ్మగారికి కొంచెం తోడుగా ఉండటానికీ, అమ్మాయిగారికి కొంచెం మందుమాకూ పొయ్యడానికీ మా ఆడోళ్లని పంపిస్తానండి" అని కాన్‌స్టబిలు తను చెయ్యగల సహాయాన్ని సూచించాడు.

నిజంగా సహాయం కావలసిన స్థితిలో వున్నాడు శ్రీనివాసరావు. అంచేత, "పంపించు" అని కృతజ్ఞత నిండిన కళ్లతో కాన్‌స్టబిలువైపు చూశాడు. సబిన్‌స్పెక్టరు పట్ల తనకు గల అభిమానాన్ని పూర్తిగా ప్రక టించడానికి "తమ భోజనంమాటో అయ్యా?" అని అడిగాడు కాన్‌స్ట బిల్. భోజన విషయమై జరిగిన ఏర్పాటులన్నీ అతనికి చెప్పాడు శ్రీనివాసరావు. "మా ఆడోళ్ళని తీసుకొని వస్తానండి" అని కాన్‌స్టబిలు వెళ్ళిపోయాడు.

శ్రీనివాసరావు లోపలికి వెళ్లి, భార్యకి రెండు మాత్రలు యిచ్చి మింగమన్నాడు. కాస్సేపు చలికి వణికి, కొంచెం మూలిగి, ఆ రెండు

మాత్రలూ ఆమె మింగింది. చంటిపిల్లకు మందు పొయ్యడానికి శ్రీనివాసరావుకి భయం వేసింది. ఆరునెలలకి పూర్వం చక్కగావున్న బిడ్డ వికృతరూపి అయిపోయింది. వొళ్లంతా తెగ వుబ్బిపోయింది. మందు నోట్లో పోయాలంటే పెదిమలను బలవంతాన విడదీసి పొయ్యాలి. తీరా నోట్లో పోసిన మందును మింగడం, మింగకపోవడం బిడ్డ ఓపికనుబట్టి జరగవలసిన పని. శ్రీనివాసరావుకు అంత దారుణంగా మందు పొయ్యడానికి భయం వేసింది. కాన్‌స్టబిలు భార్య వచ్చిన తరవాత ఆమెచేత పోయించవచ్చుననుకొని యివతలికి వచ్చేశాడు.

శ్రీనివాసరావు వాకిట్లోకి వచ్చేటప్పటికి యూనిఫారంలో ఉన్న కాన్‌స్టబిలు వొకడు సలాం పెట్టాడు.

"ఎవరోయ్ నువ్వు?" అన్నాడు శ్రీనివాసరావు.

"నరసరావుపేట కస్పాలో ఉన్నా నండి. డిప్టీదొరవారు తమకు ఎక్స్‌ప్రెసు యిమ్మని డ్యూటీ వేస్తే వచ్చానండి" అంటూ ఆ కాన్‌స్టబిలు తాను తీసుకు వచ్చిన ఎక్స్‌ప్రెసు కవరును శ్రీనివాసరావు చేతిలో పెట్టాడు. డిప్యూటీ సూపరింటెంటు దగ్గరనుంచి గాని, జిల్లా సూపరింటెండెంటు దగ్గర నుంచి గాని ఎక్స్‌ప్రెసు వచ్చిందంటే ఆ కవరు చింపేటప్పుడు ఏ సబిన్‌స్పెక్టరుకయినా చేతులు కొంచెం వణుకుతాయి. శ్రీనివాసరావు మనస్సు ప్రస్తుతమున్న పరిస్థితిలో అతని శరీరమంతా వణికిందంటే అసత్య మేమీలేదు.

కవరు చింపడం ఆరంభిస్తూ, ఆ కవరును తీసుకుని వచ్చిన కాన్‌స్టబిలు వైపు చూసి "స్టేషనులో హెడ్‌కాన్‌స్టబిలు ఉంటే వెంటనే రమ్మని చెప్పు" అన్నాడు శ్రీనివాసరావు.

"చిత్తం" అని సలాంపెట్టి ఆ కాన్‌స్టబిలు వెళ్ళిపోయాడు.

శ్రీనివాసరావు ఆ కవరు చింపి లోపలి కాగితం తీసి చదివాడు.

స్టూవర్టుపురం సెటిల్మెంటునుంచి తప్పించుకున్న ఎరుకలవాళ్లు కొందరు ఆ స్టేషను యిలాకాలో వున్న అడవిలో ఉన్నారని రూఢి అయిన కబురు తెలిసినందున వెంటనే సబిన్‌స్పెక్టరూ, స్టేషనులో ఉన్న యావత్తు సిబ్బందీ కలసి ఆ అడవికి వెళ్ళి ఆ ఎరుకలవాళ్ళను పట్టుకో వలసిందనీ, నరసరావు పేటనుంచి కొంత సిబ్బందితో తాను

వచ్చి ఆ అడవికి అవతలి ప్రక్కన కాపుదల వేస్తున్నాననీ డిప్యూటీ సూపరింటెండెంటు ఎక్స్‌ప్రెసు ఉత్తరువు.

ఆ కాగితం చదివి, మళ్ళీ చదివి, సంగతి మనస్సుకి పట్టించుకొనేటప్పటికి హెడ్‌కాన్‌స్టబిలు మస్తాన్, శ్రీనివాసరావు ఎదుటకు వచ్చి నిలుచున్నాడు.

"మస్తాన్, విన్నావా!" అంటూ ఆ ఉత్తరువు సంగతి చెప్పాడు శ్రీనివాసరావు.

"అయితే బయలుదేరవలసిందే" అన్నాడు మస్తాన్.

బయలుదేరవలసిందే! ఆ భార్యనూ, ఆ కూతుర్నీ వదలిపెట్టేసి, నరాల్ని కుంగదీస్తూ ఉన్న కడుపులోని ఆకలితో బయలుదేరవలసిందేనా! తప్పదు. బయలుదేరనైనా బయలుదేరాలి, ఉద్యోగానికి నీళ్ళయినా వదలాలి. "సరే" అన్నాడు శ్రీనివాసరావు.

కాసిని పాలు తెప్పించుకొని, పంచదార వేసుకొని, త్రాగి, కాన్‌స్టబిలు భార్యనూ, దాసీదానినీ, యానాదివాడినీ, భార్యకుతోడు అట్టేపెట్టి, పొరుగూరునుంచి వంటబ్రాహ్మడు వస్తే వంట వండించమని చెప్పి, బిడ్డకు మందు పొయ్యమని కాన్‌స్టబిలు భార్యతో చెప్పి, స్టేషనులో రైటర్ని మాత్రం అట్టేపెట్టి, తక్కిన సిబ్బందితో ఎరుకల వాళ్ళని పట్టుకోడానికి శ్రీనివాసరావు వెళ్ళాడు.

ఇంటి దగ్గర భయానక దృశ్యమూ, కడుపులో ఆకలీ, ఎండలో గుర్రం మీద ప్రయాణమూ ఆతని మనస్సును పూర్తిగా కలచి వేశాయి. అడవి కొసను అనుకుని ఉన్న వూరికి వెళ్ళడమూ, అడవిలో మకాం చేసిన యెరుకల వాళ్ళు సామాను కొనుక్కున్న షావుకారును ముందు మెల్లిగాను, తరవాత దబాయించీ అడిగి, వాళ్ళ బస తెలుసుకుని ఆ చోటికి వెళ్ళడమూ శ్రీనివాసరావుకు జ్ఞాపకం లేదుగాని, గుర్రాల డెక్కల చప్పుడు విని పారిపోవడానికి మూటా ముల్లే కట్టుకుని యీ లోపలనే పోలీసువాళ్ళు తమ యెదుటపడినందువల్ల వేరే దారిలేక వాళ్ళ మీద తిరగడడానికి సిద్ధంగా ఉన్న ఎరుకల గుంపును మటుకు అతడు కళ్ళారా చూశాడు.

ఎరుకలవాళ్ళు వాళ్ళలో వాళ్ళు మాట్లాడుకుంటున్నారు. మధ్య

మధ్య నిప్పులుగురిసే కళ్ళతో యీ పోలీసువాళ్ళకేసి చూస్తున్నారు. "మూటాముల్లే క్రింద పడవేసి, కర్రలన్నీ మా చేతికి యిచ్చి లోబడతారా లేదా?" అన్నాడు శ్రీనివాసరావు. ఎరుకలవాళ్ళంతా వాళ్ళ మొహాలు వాళ్ళు చూసుకున్నారు.

గుంపులో ఉన్న వొక ఎరుకలవాడు కర్ర తీసుకుని, మెరుపు మెరిసినట్లు యెగిరి, సబినస్పెక్టరును కొట్టబోయాడు. ఎరుకలవా డెంత నేర్పుతో కర్ర విసిరి ముందుకు వచ్చాడో, సబినస్పెక్టరు గుర్రం అంత నేర్పుతో వెనక కాళ్ళ మీద పైకి లేచి రెండడుగులు వెనక్కి జరిగింది.

తన వేటు వృథా అయినందుకు ఎరుకలవాడికి రోషం ఎక్కువయింది. ఒకడు తెగించడం చూసి తక్కిన వాళ్ళంతా తెగించారు.

శ్రీనివాసరావు తల గిర్రున తిరిగింది. "ఫైర్" అని పెద్ద కేక వేసి, బెల్టులో ఉన్న రివాల్వరు తీసి, దాంట్లో ఉన్న గుండ్లు అయిదూ అయిపోయినదాకా గబ గబ పేల్చివేశాడు. అతని వెంట వచ్చిన కాన్‌స్టబిల్సులో యిద్దరి దగ్గరే తుపాకులు ఉన్నాయి. శ్రీనివాసరావు అయిదుగుళ్ళు కాల్చేలోపల వాళ్ళు చెరో గుండూ కాల్చారు. ఎరుకల వాళ్ళు పెద్ద కేక వేశారు. పోలీసువాళ్లు గుర్రాలను కొంచెం వెనకకు నడుపుకుని, పొగ తగ్గిన దాకా—యీ లోపల తుపాకులలో మళ్ళీ తోటాలు దట్టించుకుని—చూస్తూ ఉన్నారు.

పొగ తగ్గింది. పదకొండుమంది ఎరుకలవాళ్ళకి ఆరుగురు వంగి సలాములు పెడుతున్నారు. క్రిందపడి ఉన్న వాళ్ళలో ముగ్గురు కదుల్తూ వున్నారు. దెబ్బలు తినని ఆరుగుర్నీ తాళ్ళతో కట్టించి, అడవికి అవతలి చివర ఉన్న డిప్యూటీ సూపరింటెండెంటుకు యీ కబురు తెలియజెయ్యడానికి ఒక కాన్‌స్టబిల్ని పంపించాడు శ్రీనివాసరావు.

డిప్యూటీ సూపరింటెండెంటు వచ్చి చూశాడు. ఇద్దరు ఎరుకల వాళ్లు చచ్చిపోయారు. ఇద్దరికి కాళ్ళలోనుంచీ, ఒకడికి భుజంలో నుంచీ గుండ్లు దూసుకుపోయాయి.

"వెల్, సబిన్‌స్పెక్టర్, వెరిగుడ్! నీకు కింగ్సు పోలీసు మెడలు రికమెండు చేస్తాను!" అన్నాడు డిప్టీ దొరగారు. ఆ ఎరుకలవాళ్ళలో

బ్రతికినవాళ్ళకి జరపవలసిన విద్యుక్త ధర్మాలు జరిపి, శ్రీనివాసరావు మళ్ళీ యింటికి మళ్ళబోయేటప్పటికి చీకటిపడింది. ఆ చీకటిలోనే ఒళ్లు తెలియని వేగంతో గుర్రాన్ని పరుగెత్తించి యింటికి చేరుకున్నాడు. గుర్రం దిగి యింట్లో అడుగుపెట్టాడో లేదో "అమ్మాయిగారు పోయినా రయ్యా!" అన్నాడు యానాదివాడు.

"అయిపోయిందీ?" అని అక్కడే కూలబడ్డాడు శ్రీనివాసరావు.

సబిన్‌స్పెక్టరు వచ్చిన సంగతి తెలిసి, రైటరు, స్టేషనుకు వచ్చిన టపా తీసుకొని యింటికి వచ్చి, "తమ సెలవు గ్రాంటు అయిం దయ్యా! పెద్ద దొరగారు గ్రాంటుచేసి నాలుగు రోజు లయింది. కాగితం సర్కిలిన్‌స్పెక్టరు దగ్గర్నుంచి రావడం ఆలస్యం అయింది" అంటూ సెలవు ఆర్డరును సబిన్‌స్పెక్టరు చేతికి యిచ్చాడు.

Laxminarayana Book Stall
ALL KINDS OF PAPERS &
MAGAZINES SUPPLIERS
MANDAL-RASTI HYDERABAD

---

## 17. ఎవరు దోషి?

"ఎలాగయినా సాక్ష్యం సంపాయించాలి. జిల్లా సూపర్నెంటు మకాంలో ఉండగా ఇలాంటి ఘోరం జరిగిందంటే, దానికి తగిన కూపీ తియ్యకపోతే, మన ఉద్యోగాలు దక్కవు" అంటూ చేతులో ఉన్న సగం కాలిన చుట్టకొనను మునిపంటితో కొరుకుతూ, ఎదుట కూర్చున్న హెడ్‌కాన్‌స్టబిలు మొహంచూశాడు సబిన్‌స్పెక్టరు రంగారావు.

"అవును సార్; తమరికన్న నాకు యింకా యెక్కువ బెంగగా వుంది. ఆ రోజు నేను నైట్‌డ్యూటీ వేసుకున్నాను కూడాను. నా నోటు బుక్కు తణిఖీలో ఆ సంగతి తేలిపోతుంది. నైట్‌డ్యూటీలో నేను ఉన్నా యింత ఘోరం జరిగిదంటే నన్ను సంజాయిషీ అడిగి డిస్మిసు చేస్తారని భయమేస్తోంది కూడాను—"